ఉచిత బస్సు ప్రయాణం ఊసెత్తరా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు, ప్రతి నెలా మహిళలకు రూ.1,500, యువతకు నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు అంటూ సూపర్ సిక్స్ హామీలు గుప్పించారు. టీడీపీ, కూటమి నేతలు, సీఎం కుర్చీనెక్కిన చంద్ర బాబు నాయుడు తూతూమంత్రంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం అంటూ రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి ప్రకటించగా.. ఇంకో అమాత్యుడు నారా లోకేష్ రోడ్ మ్యాప్ వేద్దాం..వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిద్దామని చెబుతున్నారు. హామీలు చూస్తుంటే భయమేస్తోందని ఏకంగా సీఎం చంద్ర బాబు చెప్పడంపై అన్ని వర్గాల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఉచిత ప్రయాణం లేనట్టేనా? అని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

- ఎన్నికల హామీ అమలు చేయకపోవడంపై మహిళల అసహనం
- అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా అతీగతీ లేదంటూ విమర్శలు
- ఓట్లేసి మోసపోయామంటూ గగ్గోలు



దెందులూరు: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోల్లో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికల ముందు మహిళలు ఎక్కడైనా ఉచితం ప్రయాణం చేయొచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. టీడీపీ కూటమి నేతలు గద్దెనెక్కి 10నెలలు గడుస్తున్నా హామీలను పట్టించుకోవడం లేదు. ఉచిత బస్సు ప్రయాణం ఇంకెప్పుడు అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేసింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూడా అదే ఫార్ములాను అమలు చేసింది. ఉచిత బస్సు అంటూ జోరుగా ప్రచారం చేపట్టింది. అయితే ఉచిత బస్సు హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబు ఉచిత బస్సు ప్రయాణమని ప్రజలను మభ్యపెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు.

స్పష్టత లేదు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు కనీసం స్పష్టత ఇవ్వడం లేదు. రోడుడ రవాణశాఖ మంత్రి మాత్రం త్వరలోనే అని చెప్పడం తప్ప.. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. తొలుత గత ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అని అన్నారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని వదంతులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికితోడు ఏకంగా చంద్రబాబు సైతం సూపర్ సిక్స్ హామీలయితే ఇచ్చాము. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూర్చింది.

మహిళా ఓటర్లను ఆకర్షించేందుకే హామీ:

నియోజకవర్గంలో దాదాపు 2లక్షల 20 వేలుమంది పైగా జనాభా ఉన్నారు. అందులో 18 ఏళ్ల పైబడిన మహిళలు లక్ష పైనేఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. రోజూ సగటున 40శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని హామీ ఇచ్చారు. తీరా గెలిచాకా హామీలను పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు.

హామీలన్నీ అమలు చేయాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఎప్పుడూ అమలు చేస్తారో కూడా తెలియడం లేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వం అమలు చేసింది కదా? ఇక్కడ ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. ఈ నిర్ణయం సరికాదు.

– సొంగా ప్రమీలారాణి, ఎంపీటీసీ, గాలాయగూడెం

హామీ ఇచ్చేటప్పుడు భయం కనిపించదా?



ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చేటప్పుడు ఆచరణకు సాధ్యమా, అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంలో కూర్చుని ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తుంది అని చెప్పడం సిగ్గుచేటు. హామీలు ఇచ్చేటప్పుడు చంద్రబాబుకు భయం కనిపించ లేదు. టీడీపీకి ఓటు వేసి మహిళలు మోసపోయారు.

– కె. కృష్ణవేణి, వార్డు మెంబర్, దెందులూరు

ఉచిత బస్సును వెంటనే అమలు చేయాలి



మహిళలను మోసం చేస్తే కూటమి ప్రభుత్వానికి మంచిది కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా కూటమి పెద్దలు ఉచిత బస్సులు వెంటనే అమలు చేయాలి. చంద్రబాబు ఏ విధంగా హామీ ఇచ్చారు, ఎటువంటి మెలికలు లేకుండా అదే విధంగా హామీ అమలు జరగాలి.

– బత్తుల రత్నకుమారి, ఎంపీపీ, పెదపాడు

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులు చేయిస్తున్న దృశ్యం

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి రమేష్ అన్నారు. గురువారం కొవ్వలిలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ. 21 లక్షలతో ఈ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్ పలు సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏవో సత్యనారాయణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు గోల్డెన్ రాజు, కర్ణుడు, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు సెక్షన్ పరిధిలోని అంబర్‌పేట, ఆగడాలలంక సబ్‌స్టేషన్లు ఏరియాల్లో చెట్లు తొలగింపు, సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. అంబర్‌పేట, జి.కంద్రిక, వడ్లపట్ల, అన్నేవారిగూడెం, కోరుకల్లు, గుండుగొలను, రత్నాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

దెందులూరు ఉపసర్పంచ్‌గా బార్నాల అప్పారావు



బార్నాల అప్పారావుకు డిక్లరేషన్‌ను అందజేస్తున్న సర్పంచ్ తోట ఏసమ్మ

దెందులూరు: దెందులూరు గ్రామ ఉపసర్పంచ్‌గా బార్నాల అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి దెందులూరు మండలం పంచాయతీలో విస్తరణ అధికారి గురువారం దెందులూరు గ్రామ సచివాలయం రెండులో అధికారికంగా ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని గ్రామ సర్పంచ్ తోట ఏసమ్మ మండల పంచాయతీలు విస్తరణ అధికారి ఉప సర్పంచ్‌కు అందజేశారు.

సొసైటీ అభివృద్ధికి సభ్యుల సహకారం మరువలేనిది



సొసైటీలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి నర్సింహమూర్తి

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలు విశాల పరపతి సహకారం సంఘం 120 కోట్ల రూపాయలు టర్నోవర్‌తో ముందుకు సాగుతోందని సొసైటీ సర్సన్ ఇన్‌చార్జి కురుచేటి నర్సింహమూర్తి అన్నారు. గురువారం సొసైటీలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో నర్సింహమూర్తి మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి సభ్యులు అందజేస్తున్న సేవలు మరవులేనిదన్నారు. సొసైటీలో పనిచేసే ఉద్యోగులకు హెచ్‌ఆర్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి యర్రాశ్రీనివాసరావు నివేదికను చదివారు. ఈ సమావేశంలో అధికారులు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కొండలరావుపాలెం ఉపసర్పంచ్‌గా కాట్రు దివ్య



దివ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

పెదవేగి : మండలంలోని రెండు గ్రామాల్లో నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా జరిగింది. ఈ ఎన్నికల్లో పెదవేగి మండలం కొండలరావుపాలెం గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ అభ్యర్థి కాట్రు దివ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాలడుగు సత్యవతి, ఉపసర్పంచ్ దివ్యకు నియామక పత్రాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామశింగవరం గ్రామ ఉపసర్పంచ్‌గా టీడీపీకి చెందిన బండారు రమేష్ ఎన్నికయ్యారు.

ఆత్మీయ కలయిక



అధినేతతో ముండూరు సర్పంచ్ దేవిబాల

పెదవేగి : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మండలంలోని ముండూరు సర్పంచ్ రాచూరి దేవిబాల గురువారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ గా ఎం లిఖిత



లిఖితను సన్మానిస్తున్న సినీ నటుడు ప్రదీప్

దెందులూరు: ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా దెందులూరుకి చెందిన ఎం లిఖిత గురువారం ఎంపికయ్యారు. హైదరాబాదులో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాలకు సంబంధించి నైపుణ్యత గల వ్యక్తులకు శిక్షణ కార్యక్రమం హోటల్ మినర్వాలో నిర్వహించారు. ఈ సెక్షన్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన లిఖితకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంప నాగేశ్వరరావు ప్రముఖ సినీ నటుడు ప్రదీప్ అధ్యక్షుడు రామచంద్రుడు ఉపాధ్యక్షులు మాధవి సర్టిఫికెట్ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు ప్రదీప్ మాట్లాడుతూ లిఖిత నైపుణ్యం ద్వారా సమాజంలో అవగాహన సేవ రంగాల్లో విశిష్ట సేవలు అందజేయాలని కోరారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



కేశవరంలో ఉపాధికూలీల సమస్యలు తెలుసుకుంటున్న జక్కంశెట్టి

గణపవరం: ఉపాధికూలీలను జీపీఎస్ పేరుతో ఫొటోలు తీయడానికి ఐదారు కిలోమీటర్ల దూరం నడిపించడం భావ్యంకాదని వారు పనిచేస్తున్న చోటే ఫోటోలు తీయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన గణపవరం మండలం కేశవరంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో నిర్దేశించిన సదుపాయాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మస్టర్ విధానం వల్ల పనిచేసి అలసిపోయిన కూలీలను ఎండలో నాలుగు నుంచి ఐదు కిలో మీటర్ల దూరం నడిపించడం వారికి తీవ్ర ఇబ్బందిగా ఉందని, జిల్లా, మండల కేంద్రాలలోనే నెట్‌వర్క్ సరిగా పనిచేయక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి, ఆన్‌లైన్ మస్టర్ విధానం రద్దు చేయాలని కోరారు. ఉపాధి పనులు 100రోజులు ఉండాలని ప్రకటనలు తప్ప వాస్తవానికి ఎక్కడాఅమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.కవిత

భీమడోలు: బాల్య వివాహ నిరోధక కమిటీలు బాధ్యతతో పని చేయాలని ఐసీడీఎస్ గుండుగొలను సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.కవిత అన్నారు. గుండుగొలను ఉన్నత పాఠశాల, గుండుగొలను శాఖా గ్రంథాలయ ఆవరణాల్లో వేర్వేరుగా గురువారం బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులతో అవగాహన సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలకు క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైద్యాధికారిణి ఆర్.జాహ్నవి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం ద్వారా చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం ద్వారా అనేక శరీరక, మానసిక రుగ్మతలకు గురై తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడతారన్నారు. ప్రాణాప్రాయ పరిస్థితులను ఎదుర్కొంటారన్నారు. బాల్య వివాహాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సూపర్‌వైజర్ ఎం.కవిత మాట్లాడుతూ గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలన్నారు. బాలల హక్కుల జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వారికి వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు ప్రోత్సహించినా, చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. ఈ కారక్రమంలో రేఖా రామలక్ష్మి, అమరావతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌గా సప్పాలక్ష్మి ఏకగ్రీవం



ఉపసర్పంచ్ లక్ష్మిని అభినందిస్తున్న సర్పంచ్ పుప్పాల మెహర్‌కుమార్

నిడమర్రు: మండలంలోని ఎనికేపల్లి ఉపసర్పంచ్‌గా 8వార్డు మెంబర్ సప్పా లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ఈవోపీఆర్డీ ఎన్‌వీ స్వామి తెలిపారు. ఎనికేపల్లి గ్రామ సచివాలయం వద్ద ఆ గ్రామ ఉపసర్పంచ్ ఎన్నికలు గురువారం జరిగింది. ఇప్పటి వరకూ ఉపసర్పంచ్‌గా ఉన్న సరిపల్లి త్యాగరాజు తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో తిరిగి ఆస్థానానికి ఉప ఎన్నికను అధికారులు నిర్వహించారు. మొత్తం 8వార్డులు ఉండగా 2 వార్డు సభ్యులు గంధం రాజేశ్వరి సప్పాలక్ష్మిని ప్రతిపాదించగా, 4వార్డు సభ్యుడు, మాజీ ఉపసర్పంచ్ సరిపల్లి త్యాగరాజు మద్దతు ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. 8 వార్డుల్లో 7 మంది వైసీపీ మద్దతుదారులే కావడంతో ఉపసర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికైన ఉపసర్పంచ్ లక్ష్మిని సర్పంచ్ పుప్పాల మెహర్‌కుమార్, గ్రామ పెద్దలు పూలమాలలతో అభినందించారు.

కొల్లేరు వాసులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



ఆగడాలలంకలో చైతన్య యాత్రలో కాంటూరును కుదించాలని నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

భీమడోలు: కొల్లేరు ఆపరేషన్ వల్ల నష్టపోయిన కొల్లేరు ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యలు వల్ల కొల్లేరు వాసుల ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు గురువారం సీపీఎం బృందం సభ్యులు కొల్లేరు గ్రామాలు ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం యాత్రను నిర్వహించారు. సీపీఎం బృందం నాయకులు ఏ.రవి, ఆర్.లింగరాజు, కె.శ్రీనివాస్, పిల్లి రామకృష్ణ, కట్టా భాస్కరరావు, కె.లెనిన్ తదితరులు గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కాంటూరును కుదించి ప్రజలను ఆదుకోవాలంటూ వారంతా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 120ను సవరించాలని, కొల్లేరును ఐదో కాంటూరు నుంచి 3వ కాంటూరు వరకు కుదించాలని, ఆ ప్రాంతాల సమస్యలను తక్షణమే పరిష్కారించాలని వారు డిమాండ్ చేశారు. కొల్లేరు ఆపరేషన్‌లో నష్టపోయిన పేదలు, సొసైటీలు, డి.ఫారం పట్టాదారులకు కుటుంబాలకు రెండు ఏకరాల చొప్పున భూమి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


కట్లమ్మ జాతర ముగింపు



ప్రత్యేక అలంకరణలో అర్ధవరం కట్లమ్మ

గణపవరం: మండలం అర్ధవరం గ్రామ ప్రజల ఇలవేల్పు కట్లమ్మ, శ్రీనూకాలమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు గురువారం ముగిశాయి. ఐదు రోజుల పాటు నిర్వహించిన అమ్మవార్ల జాతర ముగింపు సందర్భంగా గురువారం భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని పూజలుచేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ కన్వీనర్, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము ఆధ్వర్యంలో జాతర మహోత్సవాలు నిర్వహించారు. అర్ధవరం పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించి, అమ్మవార్లను రోజూ ప్రత్యేక అలంకరణలు, పూజలు చేసి, ఆలయం వద్ద ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

తిమ్మన్నగూడెంలో ఉపాధి పనులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడి పంచాయతీ తిమ్మన్నగూడెం శివారులో గురువారం ఉపాధి పనులను ప్రారంభించారు. గ్రామస్తుల కోరిక మేరకు అధికారులు ఉపాధి పనులను కేటాయించారు. గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

హౌసింగ్ గోడౌన్‌లో ఐరన్ చోరీపై విచారణ



ఐరన్ చోరీకి గురైన హౌసింగ్ గోడౌన్

దెందులూరు: దెందులూరులో ప్రభుత్వ హౌసింగ్ గోడౌన్‌లో 16 1/2 టన్నుల ఐరన్ చోరీ పై విచారణకు నూజివీడు డీఎస్పీకు అనుమతి ఇచ్చారు. దెందులూరు ఎస్సై డీఎస్పీ అనుమతి ఇవ్వటంతో ఫిర్యాదుదారుడు హౌసింగ్ గోడౌన్ ఇంచార్జి డివిజనల్ ఇంజనీర్, దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ విచారించారు. డివిజనల్ ఇంజనీర్ వద్ద నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.గోడౌన్‌లో ఉన్న ఐరన్ లో 16 1/2 టన్నుల ఐరన్ చోరీ జరిగిందని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. చోరీ జరిగిన రోజు సీసీ పుటేజ్ కాపీని సైతం ఎస్సైకు అందజేశాననీ, డివిజనల్ ఇంజనీర్ వివరించారు. సీసీటీవీ పుటేజీలో ట్రక్కు ఆటో చోరీ చేస్తున్న మనుషులు నమోదు అయిందన్నారు. కాగా దెందులూరు పోలీస్ స్టేషన్‌కు కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రభుత్వ హౌసింగ్ గోడౌన్‌లో ఐరన్ చోరీ జరగటం సంచలనంగా మారింది. సీసీ కెమెరా ఉన్న చోరీ జరగడంతో దెందులూరు హౌసింగ్ గోడౌన్‌లో ఉన్న ఐరన్‌ను ఏలూరు డీఈ కార్యాలయానికి తరలించారు.

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: గ్రామ కట్టుబాటు పేరుతో చట్టాన్ని గ్రామ పెద్దలు చేతుల్లో తీసుకోరాదని నిడమర్రు ఎస్సై వీర ప్రసాద్ అన్నారు. గురువారం తోకలపల్లి గ్రామ సామాజిక భవనంలో గ్రామ పెద్దలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరప్రసాద్ మాట్లాడుతూ గ్రామ కట్టు బాటు అంటూ పేపర్లమీద రాసుకుని విడాకాలు ఇవ్వడం, నేరాలు చేసిన వారికి గ్రామ పెద్దలే జరిమానాలు విధించడం, సాంఘిక భహిష్కరణలు చేయడం వంటివి చట్టరీత్యా నేరమని గ్రామ పెద్దలు గుర్తించాలన్నారు. ఇటీవల కొల్లేరు గ్రామల్లో ఇటువంటి సంఘటనలు జిల్లా అధికారుల దృష్టికి రావడంతో ఈ అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు

భీమడోలు: మండలంలో స్వయం ఉపాధి సోపానం కింద బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం ఈనెల 28, ఏప్రిల్ 3వ తేదీల్లో భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. ఈనెల 28వ తేదీన ఉదయం 9 గంటలకు భీమడోలు, మధ్యాహ్నం 2 గంటలకు అంబర్‌పేట గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు హాజరు కావాలని కోరారు. ఏప్రిల్ 3వ తేదీన ఉదయం 9 గంటలకు ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం ,పూళ్ల, మధ్యాహ్నం 2 గంటలకు దుద్దేపూడి, కోడూరుపాడు వారంతా హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ సత్యనారాయణ

పెదపాడు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం న్యాయ్యస్థానం పనిచేస్తుందని గ్రీవెన్స్ ఫోరం చైర్మన్ బీవీసత్యన్నారాయణ తెలిపారు. నియోజకవర్గ స్థాయి విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పెదపాడు విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను గురువారం నిర్వహించారు. సీజీఆర్ఎస్ చైర్మన్ బీవీ సత్యన్నారాయణ వినియోగదారుల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. అనంతరం సత్యన్నారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారుల సమస్యలను తెలుసుకుని వాటినిపూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ఈ పరిష్కార వేదికలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిలో బాగంగా శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లా వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఈ ఫోరం పరిష్కరిస్తుందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నేటి వరకు 107 క్యాంపులు నిర్వహించామని, గురువారం నిర్వహించిన ఈ కాంపులో 26 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదులను నేరుగానే కాకుండా 1912 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి అందజేయవచ్చాన్నారు. సదరు ఫిర్యాదులపై విచారణ చేసి సమస్యలకు పరిష్కారం చూపుతామని చెప్పారు. ఈకార్యక్రమంలో మెంబరు ఫైనాన్స్ షేక్ బాబరు, మెంబరు ఎస్ మురళీకృష్ణ, విద్యుత్ శాఖ డీఈ అంబేడ్కర్, ఏడీ శ్రీనివాస్, ఏఈ వైరాంబాబు ప్రజలు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం హేలూరులోని ఎస్‌టీయూ భవనంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బి.మనోజ్ కుమార్ వ్యవహరించారు. ఫ్యాప్టో నూతన చైర్మన్‌గా ఏపీటీఎఫ్ 1938 ఏలూరు జిల్లా అధ్యక్షుడు జి.మోహన రావు, సెక్రటరీ జనరల్‌గా డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దుకూరి ఆదినారాయణ ఎన్నికయ్యారు. కమిటీ కో చైర్మన్-1, 3లుగా జి.వెంకటేశ్వరరావు, జి.ప్రకాష్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా ఆర్ రవికుమార్, ఎం శామ్యూల్, బి.రెడ్డిదొర, కార్యదర్శిగా సీహెచ్ శివరామ్, కోశాధికారిగా ఎస్‌డీ జిలానీ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని, ఫ్యాప్టో నాయకులను కలుపుకుని హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని మోహనరావు, ఆదినారాయణలు తెలిపారు. సీపీఎస్ రద్దు కోసం, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం ఆందోళనలు చేస్తామన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, వెంటనే చేపట్టాలని, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినికి అభినందనలు

ఉంగుటూరు: మండలంలోని తల్లాపురం ఎంపీయుపీ పాఠశాలలో 5 వతరగతి చదువుతున్న సైదు రుషిక లక్ష్మి నవోదయ లో 6వతరగతికి సీటు సాధించింది. బాలికకు ఉపాధాయయుడు పుప్పాల నర్సింహరావు తరిఫీదు ఇచ్చారు. సీటు లభించడంతో ఆబాలికను ప్రధానోపాధ్యాయులు సీహెచ్ వి వి సత్యనారాయణ, ఉపాధ్యాయుడు పి. నర్సింహరావు, వెలెఫేర్ సహాయకడు వేంకటేష్‌లు బాలికను ప్రత్యేకంగా అభినందించారు.